క్లుప్తంగా

ఇగ్నోలో స్వచ్ఛతా పక్షోత్సవాలు



స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న ఇగ్నో ఉద్యోగులు

ఎంవీపీ కాలనీ: స్వచ్ఛభారత్ అభియాన్ పథకంలో భాగంగా భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛతా పక్షోత్సవాల్లో ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) విశాఖ కేంద్రం భాగస్వామి అయినట్టు డైరెక్టర్ ధర్మారావు తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం కేంద్ర ఉద్యోగులు ఆధ్వర్యంలో లాసన్స్‌బే పార్కు పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములుగా నిలవాలన్నారు. ఇల్లు, కార్యాలయంతో పాటు అన్ని చోట్ల పరిశుభ్రత పాటించాలన్నారు.

16వ వార్డులో అన్నదానం



అన్నదానం చేస్తున్న ఎంపీ ఎంవీవీ, మొల్లి అప్పారావు, గుడ్ల సత్యారెడ్డి

మద్దిలపాలెం: వినాయక ఉత్సవాలలో భాగంగా మంగళవారం జీవీఎంసీ 16వ వార్డు కృష్ణా కళాశాల రోడ్డులోని లక్ష్మీ గణపతి ఆలయంలో అన్నదానం చేశారు. ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, పార్టీ 23వ వార్డు ఇన్‌చార్జి గుడ్ల సత్యారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


వైభవంగా వార్షిక పవిత్రోత్సవాలు



పవిత్రాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్–6లోని శ్రీవేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీవారి వార్షిక పవిత్రోత్సవాలను వైభవంగా నిర్వహించారు. సోమవారం అంకురార్పణ, యోగశాల ప్రవేశం జరగ్గా.. మంగళ వారం పవిత్ర ఆదివాసంలో భాగంగా ప్రదక్షిణ లు నిర్వహించారు. పవిత్రాలను ఆలయ కార్యవర్గ సభ్యులు, అర్చకులు ప్రదక్షిణ పూర్వకంగా యోగశాలలో పవిత్ర అదివాసానికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

ప్రాక్టికల్ నాలెడ్జి అవసరం



బుల్లయ్య కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు నిర్మించిన గోడ

సీతంపేట: స్థానిక లంకపల్లి బుల్లయ్య కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రాక్టికల్ లెర్నింగ్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులతో కళాశాల గ్రౌండ్‌లో ఇటుకలతో గోడ నిర్మించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ దీపక్ చౌదరి మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి సదస్సులలో పాల్గొనడం వల్ల ఇంజినీరింగ్ విద్యపై అవగాహన, ప్రాక్టికల్ నాలెడ్జి లభిస్తుందన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి జి.టి.నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆలోచనలకు సృజనాత్మకత జోడిస్తే భవిష్యత్ బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ ధ్యేయం

- వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ
- 12వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ ఎంవీవీ

ఆరిలోవ: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని విశాఖ ఎంపీ, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. జీవీఎంసీ 12వ వార్డులో కార్పొరేటర్ అక్కరమాని రోహిణి ఆధ్వర్యంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ కార్పొరేటర్, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులతో కలసి సుందరయ్య కాలనీలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. పథకాల వివరాలతో కూడిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఏయే పథకాల ద్వారా ఎంతెంత లబ్ధి చేకూరిందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా వార్డు కార్పొరేటర్, సచివాలయం సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీ సూచించారు. సమస్యలపై వెంటనే స్పందించి, పరిష్కరించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఎంవీవీ మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టినప్పటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారన్నారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి పేదలకు మేలు చేస్తున్నారన్నారు. అర్హులకు పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు బాబిరెడ్డి, నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ మోహన్‌రావు, స్థానిక నాయకులు అల్లంపల్లి రాజబాబు, సత్తి మందారెడ్డి, కన్నేటి సుబ్బారెడ్డి, చొక్కర శేఖర్, జి.విక్టర్, హుస్సేన్, సుజాత, అర్జున్, మోహన్, శ్రీనివాస్, జ్యోతి ప్రకాష్, ఈగల బుజ్జి, సచివాలయం కన్వీనర్లు పాల్గొన్నారు.

పలు చోట్ల హోర్డింగ్‌ల తొలగింపు



ఆర్కే బీచ్ వద్ద హోర్డింగ్‌ను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది



వుడా పార్కుకు ఎదురుగా ఉన్న హోర్డింగ్‌ను తొలగించిన సిబ్బంది

దాబాగార్డెన్స్ : నగరంలో ప్రధాన జంక్షన్లతో పాటు మెయిన్‌రోడ్లు, జాతీయ రహదారులు, ఐల్యాండ్ల వద్ద పెద్ద పెద్ద ప్రచార హోర్డింగ్స్ విచ్చలవిడిగా ఉన్నాయి. వాటిని తొలగించేందుకు జీవీఎంసీ శ్రీకారం చుట్టింది. 3, 4 జోన్ల పరిధిలో ప్రమాదకరమైన హోర్డింగ్‌లను మంగళవారం తొలగించారు. జీవీఎంసీ డిప్యూటీ సిటీ ప్లానర్ పద్మజ నేతృత్వంలో ఈ తొలగింపు కార్యక్రమం చేపట్టారు. సుప్రీం కోర్టు ఆదేశాలతో రోడ్ సేఫ్టీ నిర్ణయాల మేరకు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆదేశాలతో ఆయా జోన్ల పరిధిలో పాదచారులు, నడక మార్గంలో ప్రమాదకరమైన హోర్డింగ్‌లు తొలగించారు. జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన తొలగింపు కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీజీ సిద్ధాంతాలు అనుసరణీయం

బీచ్ రోడ్డు: గాంధేయ ఆదర్శాలు, విలువలు నేటి ఆధునిక ప్రపంచానికి ఎంతో అవసరమని ఏయూ రెక్టార్ సమత అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని ఏయూలోని గాంధీ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో 'ఎమర్జింగ్ గ్లోబల్ ఆర్డర్, రిలవెన్స్ ఆఫ్ గాంధీయన్ థాట్స్'అనే అంశంపై గత రెండు రోజులుగా జరుగుతున్న సదస్సు మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, తదితరులు పాల్గొని గాంధీ సిద్ధాంతాలు, అహింసా మార్గం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. యువత గాంధీ సిద్ధాంతాలు, ఆలోచనలను ఆచరణలో పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య వి.కృష్ణ మోహన్, కేంద్రం డైరెక్టర్ ఆచార్య సీతామాణిక్యం, పలువురు ఆచార్యులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీల నిర్మాణానికి వినతి



యూపీహెచ్‌సీ నిర్మాణానికి నిధుల కేటాయింపుపై మంత్రికి విన్నవిస్తున్న పల్లా దుర్గారావు

మద్దిలపాలెం : జీవీఎంసీ 28వ వార్డులో యూపీహెచ్‌సీ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరుతూ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజినీని వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు కోరారు. ఈ మేరకు ఇసుకతోటలో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మంత్రిని కలిసిన ఆయన వినతిపత్రం అందజేశారు. యుపీహెచ్‌సీ నిర్మాణానికి స్థలం ఉందని, నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి, త్వరలో నిధులు కేటాయించనున్నామని హామీ ఇచ్చారు.

22వ వార్డులో..

జీవీఎంసీ 22వ వార్డులో యూపీహెచ్‌సీ మంజూరైందని, అయితే నిర్మాణానికి స్థలం లేదనే నెపంతో జోన్–2 పరిధిలోని 5వ వార్డుకు ఆస్పత్రిని తరలించారని కార్పొరేటర్ పీతల మూర్తి తెలిపారు. మళ్లీ వార్డులో యూపీహెచ్‌సీ నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజినీకి ఆయన వినతిపత్రం అందజేశారు. శివానందపురంలో 400 గజాల స్థలం ఉందన్నారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు.

జయలక్ష్మికి గురుపీఠ హిందీ సేవా పురస్కారం



జయలక్ష్మిని సత్కరిస్తున్న గురుపీఠ సమితి సభ్యులు

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల హిందీ విభాగాధ్యక్షులు డాక్టర్ పిశిపాటి కామేశ్వరి జయలక్ష్మికి గురు పీఠ పురస్కారం లభించింది. తెనాలిలోని బోయపాటి గురు దంపతుల గురుపీఠ సమితి నేతృత్వంలో డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి చేతుల మీదుగా జరిగిన కార్యక్రమంలో డాక్టర్ జయలక్ష్మి మాట్లాడుతూ విశాఖలో చేపట్టిన హిందీ సాహిత్య సేవా కార్యక్రమాలు ఇంత గుర్తింపు తేవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం డాక్టర్ జయలక్ష్మిని సమితి సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి డాక్టర్ ఈలప్రోలు శ్రీనివాస్‌రావు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ఘనంగా శ్రీత్యాగరాజస్వామి ఆరాధన ఉత్సవం



తిరువీధి మహోత్సవంలో పాల్గొన్న నాదస్వర కళాకారులు

సీతంపేట: శ్రీమారుతి నాయీ బ్రాహ్మణ నాదస్వర డోలు కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక శంకరమఠంలో శ్రీత్యాగరాజస్వామి ఆరాధన ఉత్సవం ఘనంగా జరిగింది, ముందుగా తిరువీధి మహోత్సవం నిర్వహించి అనంతరం సంగీత జనకులం ప్రతినిధి ఎ.వెంకటరావు శిష్య బృందం త్యాగరాజ సంకీర్తనలతో సంచరత్న సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శంకరమఠం అధ్యక్షులు డాక్టర్ టి.రవిరాజు పాల్గొని నాదస్వర కళాకారుల సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా నాదస్వర విద్వాన్ వి.తిమ్మరాజు, డోలు విద్వాన్ పి.బంగారయ్యలను ఘనంగా సత్కరించి వారి సంగీత సేవలను కొనియాడారు. చెన్నైకు చెందిన నాదస్వర డోలుకళాకారులచే నిర్వహించిన నాదస్వర కచేరి, కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ఆస్థాన నాదస్వర కళాకారుల కచేరి అలరించింది. ఈ కార్యక్రమంలో వి.నూకరాజు, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, సంస్థ అధ్యక్షులు ఎల్.కృష్ణ, కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి కె.ఆదినారాయణ, కోశాధికారి పి.బంగారయ్య, ప్రతినిధులు పి.శ్రీనివాసరావు, ఎ.రామకృష్ణ పాల్గొన్నారు.

12న జీవీఎంసీ దుకాణాలకు బహిరంగ వేలం

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ జోన్–4 పరిధిలో దుకాణాలు, కల్యాణ మండపాలు, క్యాంటీన్‌కు ఈనెల 12న బహిరంగ వేలం వేయనున్నట్టు జోనల్ కమిషనర్ శివప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 11 నుంచి 35వ వార్డు పరిధి స్ప్రింగ్ రోడ్డులో గల డైక్స్‌ట్యాంక్ వాణిజ్య సముదాయంలో, 31, 35 వార్డుల పరిధిలోకి వచ్చే దుకాణ సముదాయాలు, 39వ వార్డు లక్ష్మీటాకీస్ సమీపాన పద్మానగర్ వాణిజ్య సముదాయంలో, 31వ వార్డులో, 37వ వార్డు రెల్లివీధి ఫిష్‌మార్కెట్ (రోడ్డు సైడ్)కు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్టు జోనల్ కమిషనర్ తెలిపారు. ఆసక్తి గల వ్యక్తులు/ సంస్థలు జోనల్ కార్యాలయంలో నిర్వహించనున్న వేలం పాటలో పాల్గొనాలని కోరారు. పూర్తి వివరాలకు జోన్–4 కార్యాలయ పని వేళల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు పర్యవేక్షణ అధికారిని సంప్రదించాలని పేర్కొన్నారు.

సమష్టి కృషితో ఇళ్ల స్థలాలు సాధిద్దాం

దాబాగార్డెన్స్: సమష్టి కృషితో జర్నలిస్టుల సొంతింటి కల నెరవేర్చుకుందామని విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ గౌరవ అధ్యక్షులు జి.జనార్దనరావు, అధ్యక్షుడు బి.రవికాంత్ పిలుపునిచ్చారు. విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. సుమారు 800 మందికి పైగా అక్రిడేటెడ్ జర్నలిస్టులు సభ్యులుగా చేరారు. తొలుత ఈ కార్యక్రమం కేవలం మూడు రోజుల్లోనే ముగించాలని భావించినా జర్నలిస్టుల విజ్ఞప్తి మేరకు మరో రోజు పొడిగించి మంగళవారం ప్రక్రియ ముగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తదుపరి కార్యాచరణను సభ్యులకు త్వరలోనే తెలియజేస్తామని చెప్పారు. ఇప్పటికే సొసైటీ తరఫున వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి, కలెక్టర్ మల్లికార్జునకు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. ప్రభుత్వం సానుకూల దృక్పథంతో వుండటం కలిసి వచ్చే అంశం అని పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్యపై దర్యాప్తు ముమ్మరం



గుర్తు తెలియని యువకుడి మృతదేహం (ఫైల్)

సీతమ్మధార : ఇటీవల గుర్తు తెలియని యువకుడు (28) చెట్టుకు ఉరేసుకుని మృతి చెందిన ఘటనపై ఫోర్తుటౌన్ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. అక్కయ్యపాలెం హైవేలో పాత బస్‌స్టాప్ సమీపంలో గత నెల 28వ తేదీ రాత్రి 10.30 గంటల సమయంలో మర్రిచెట్టుకు ఓ యువకుడు వేలాడుతూ కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారమం దించారు. మృతి చెందిన యువకుడి వివరాలు ఇంతవరకు తెలియరాలేదు. సమీపంలోని సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్నారు. సీఐ విజయకుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం యువకుడి మృతదేహం కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు.

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: స్టీల్‌సిటీ ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్ల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఐటీఐ ప్రిన్సిపాల్ కె. శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 7వ తేదీలోగా iti.gov.in పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న కాపీతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 8న నిర్వహించనున్న వెరిఫికేషన్‌కు హాజరు కావాలని తెలియజేశారు. ఐటీఐలో ప్రవేశం కోసం ఈ నెల 9న ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 91773 91289 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఉక్కు ఉద్యోగులకు లాంగ్ సర్వీస్ అవార్డులు



ఉద్యోగికి అవార్డు అందజేస్తున్న జీఎం చిట్టిబాబు, అధికారులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు మంగళవారం లాంగ్ సర్వీసు అవార్డులు అందజేశారు. స్టీల్‌ప్లాంట్‌లో 25ఏళ్లు పూర్తి చేసుకున్న ఇద్దరు ఉద్యోగులకు ఆయా విభాగాల్లో ఈ అవార్డులను బహూకరించారు. హెచ్ఆర్ విభాగం ఆధ్వర్యంలో ఏసీఎస్ విభాగం కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ఏసీఎస్ విభాగం ఏజీఎం ఈ.భిక్షంకు జీఎం డాక్టర్ వి. చిట్టిబాబు 150 గ్రాముల సిల్వర్ కాయిన్, సర్వీస్ సర్టిఫికెట్ ప్రదానం చేశారు.

- ఈటీఎల్ విభాగంలో జరిగిన కార్యక్రమంలో విభాగం మేనేజర్ బి.కె. నాగరాజ నాయక్‌కు విభాగాధిపతి వి.వి.ఎస్.ఎస్. శాస్త్రి చేతుల మీదుగా సిల్వర్ కాయిన్, సర్వీస్ సర్టిఫికెట్ అందజేశారు.

క్షతగాత్రుడికి ఎంపీ ఎంవీవీ పరామర్శ



ధర్మారావు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎంవీవీ

ఎంవీపీ కాలనీ: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న 18వ వార్డుకు చెందిన దొలపల్లి ధర్మారావును విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ మంగళవారం పరామర్శించారు. సోమవారం ఫిషింగ్ హార్బర్ నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న ధర్మారావు డివైడర్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎంపీ వైఎస్సార్‌సీపీ 18వ వార్డు నాయకులతో కలిసి ఆస్పత్రికి వెళ్లి ధర్మారావు యోగక్షేమాలు తెలుసుకున్నారు. కేజీహెచ్ వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు పుక్కళ్ల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ రంగంలో సృజనాత్మకత అవసరం

- ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి
- ఘనంగా వరల్డ్ ఆర్కిటెక్చర్ డే వేడుకలు



జ్యోతి వెలిగించి వేడుకలు ప్రారంభిస్తున్న ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి

ఎంవీపీ కాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్కిటెక్చ ర్ విభాగ విద్యార్థులు వరల్డ్ క్లాస్ నిర్మాణాలు చేపట్టే దిశగా నైపుణ్యాలు పెంచుకోవాలని ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి అన్నారు. వరల్డ్ ఆర్కిటెక్చర్ డే సందర్భంగా మంగళవారం ఏయూలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియం వేదికగా వేడుక లు నిర్వహించారు. ఏయూ ఆర్కిటెక్చర్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో వీసీ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సాంకేతికంగా ప్రపంచం శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. సేవా రంగంతో పాటు నిర్మాణం, పారిశ్రామిక, స్పేస్ రంగాల్లో సాంకేతికాభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతుందన్నారు. ఈ నేపథ్యంలో భవిష్యత్ అవసరాలు, ఆవిష్కరణలకు అనుగుణంగా విద్యార్థుల ఆలోచనలు ఉండాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఆర్కిటెక్చర్ రంగంలో అద్భుతాలు జరుగుతున్నాయన్నారు. ఆర్కిటెక్చర్ ఇంజినీర్లు సృజనాత్మకతతో కూడిన భవనాల నిర్మాణంతో సత్తా చాటుతున్నారన్నారు. ఆ దిశగా ఏయూ విద్యార్థులు కూడా నైపుణ్యం సాధించాలని ఆకాంక్షించారు. క్రియేటివిటీతో కూడిన నైపుణ్యం, వినూత్నమైన ఆలోచనలు ఈ రంగంలో స్థిరపడే యువతకు అవసరమన్నారు. 98 ఏళ్ల చారిత్రాత్మక నేపథ్యంలో ఉన్న ఏయూ భవనాలను పరిరక్షించే బాధ్యతను ఆర్కిటెక్చర్ విభాగ విద్యార్థులకు అప్పగించినట్లు తెలిపారు. విద్యార్థులు ఒక్కో భవనాన్ని దత్తత తీసుకొని కోర్సు పూర్తయ్యే వరకు దాని పరిరక్షణతో పాటు సంరక్షణకు అవసరమైన సలహాలు అందించాలని వీసీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఆర్కిటెక్చర్ విభాగాధిపతి ఆచార్య విశ్వనాథకుమార్, ఆచార్య రేవతి, గీతం ఆర్కిటెక్చర్ విభాగ డీన్ డాక్టర్ విభూతి సత్యదేవి, ఐఐఏపీ చాప్టర్ చైర్మన్ విజయభాస్కర్, ఐఐఏ విశాఖ చాప్టర్ చైర్మన్ రాజేష్, విభాగ పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐలో విద్యార్థులకు ఉత్తమ శిక్షణ



మాట్లాడుతున్న ఎఫ్‌సీఐ ప్రిన్సిపాల్ వెంకటరమణ

ఆరిలోవ: ప్రభుత్వ ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌సీఐ)లో విద్యార్థులకు ఉత్తమ శిక్షణ అందిస్తున్నట్లు ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ తెలిపారు. ఇన్‌స్టిట్యూట్‌లో మంగళవారం అధ్యాపకులతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 5న ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఇక్కడి అధ్యాపకులను సత్కరించనున్నట్లు తెలిపారు. ఎఫ్‌సీఐలో పేద విద్యార్థులు వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్నారన్నారు. ప్రస్తుతం సుమారు 90 మందికి పైగా విద్యార్థులు ఉన్నారని చెప్పారు. వారిలో 14 మంది బాలికలున్నట్లు తెలిపారు. వీరిలో పదో తరగతి నుంచి పీజీ, బీటెక్ చదువుకున్నవారు కూడా ఉన్నారన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నామన్నారు. ఇన్‌స్టిట్యూట్‌కు సంబంధించి లోగోను గురువారం ఆవిష్కరిస్తామన్నారు. ఈ సమావేశంలో అధ్యాపకులు రవి రాఘవన్, ఎన్.పార్థసారథి, బి.కుముదిని పాల్గొన్నారు.

చలో స్టీల్‌ప్లాంట్‌కు తరలిరండి



ఆరిలోవ అంబేడ్కర్ కూడలి వద్ద ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

ఆరిలోవ: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం గురువారం కూర్మన్నపాలెంలో నిర్వహించనున్న చలో స్టీల్‌ప్లాంట్ కార్యక్రమానికి ప్రజలు తరలిరావాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆరిలోవ అంబేడ్కర్ కూడలి, బాలాజీనగర్ సంత ప్రాంతాలలో మంగళవారం ప్రచారం చేశారు. చలో స్టీల్‌ప్లాంట్‌కు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలో స్టీల్‌ప్లాంట్ కార్యక్రమంలో భాగంగా జరిగే బహిరంగ సభను ప్రజలు జయప్రదం చేయాలన్నారు. ఈ సభకు సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి హాజరు కానున్నారని తెలిపారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మేయడానికి సిద్ధపడిందని ఆరోపించారు. దీనికి వ్యతిరేకంగా స్టీల్ ప్లాంట్ కార్మికులు, ప్రజలు పోరాడుతున్నప్పటికీ ప్రధాని నిర్ణయం మార్చుకోకపోవడం దారుణమన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రజలంతా కలసి పోరాటం చేసి కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరిలోవ జోన్ సీపీఎం నాయకులు నరేంద్రకుమార్, పి.శంకర్, లక్ష్మి, కుమారి, సూర్యనారాయణ, నూర్జహాన్, సన్యాసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మద్దిలపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పిఠాపురం కాలనీలోని సీపీఎం కార్యాలయం వద్ద ప్రచార జాత నిర్వహించారు. గురువారం జరిగే చలో స్టీల్ ప్లాంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్కేఎస్వీ కుమార్, తదితరులు ఆటో ద్వారా పిఠాపురం కాలనీ, శివాజీపాలెం, హెచ్‌బీ కాలనీ, సింహాద్రిపురం, వెంకోజీపాలెం, ఎంవీపీ కాలనీలో ప్రచారం చేశారు.

'మోదీ నిరంకుశ పాలనకు మూల్యం చెల్లించక తప్పదు'



దీక్షలో పాల్గొన్న జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు

సీతమ్మధార : మోదీ నిరంకుశ పాలనకు మూల్యం చెల్లించక తప్పదని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు హెచ్చరించారు. మంగళవారం అఖిలపక్ష కార్మిక ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న దీక్షలు 913వ రోజుకు చేరుకున్న సందర్భంగా పి. వెంకటరెడ్డి మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలన్న మోదీ ప్రభుత్వ నిర్ణయం వలన నిరుద్యోగ యువత ఉపాధి కోల్పోతారన్నారు. ప్రతిపక్షం, అధికార పక్షం, జనసేన పార్టీలు ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణమ్మ, కనకరాజు, జె.లక్ష్మి, స్వర్ణభారతి స్టేడియం కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.